# 4

# క్రీస్తు శరీరం

"అటువలె, మీరు క్రీస్తుయొక్క శరీరమైయుండి వేరు వేరుగా అవయవములై యున్నారు" (1 కొరింథీ. 12:27).

ఒక మనుష్యుడు చిన్న విమానాన్ని కారుగా ఉపయోగించుకోవాలని ప్రయత్నించా డనుకొందాం. ఆ విమానాన్ని స్టీరింగుతో నడపడం కష్టం, మూలలో తిప్పడం సంకటంగా ఉంటుంది, ప్రయాణికుల సౌఖ్యానికి అసాధారణంగా ఉంటుంది, భూమార్గ ప్రయాణానికి తగనిదిగా చిత్రింపబడింది, మరియు వీధుల రాకపోకలకు సంపూర్ణంగా సరిపడనిదై యుంటుంది. ఎందుకంటే విమానం యొక్క "సహజమైన గుణాన్నిబట్టి" కారులా విమానాన్ని వాడదగునని పేర్కొనడం వాస్తవ విరుద్ధం. అది ఈ ఉపయోగానికి నిర్మింప బడలేదు, మరియు దాన్ని అలా ఉపయోగించడం దాని స్వభావాన్ని చెరపడమే ఔతుంది.

సంఘముయొక్క స్వభావాన్ని అపార్థం చేసికున్నందువల్ల క్రొత్త నిబంధన సంఘము యొక్క తప్పుడు రూప చిత్రాలు తరచుగా నిలుపబడుతున్నాయి. అందువలన, లోకంలో దాని గుర్తింపును, ఉద్దేశాన్ని, పనిని, ఉన్నది ఉన్నట్టు తెలిసికొనడానికిగాను "సంఘంయొక్క సహజ గుణాన్ని" గ్రహించవలసి ఉంటుంది.

మనం చూచినట్టే, క్రొత్త నిబంధనలో సంఘంకొరకు ఉపయోగింపబడిన కీలకమైన పద సముదాయాల్లో "క్రీస్తుయొక్క శరీరము"[1] అనేది ఒకటి. ఈ పద ప్రయోగం సంఘం యొక్క వాస్తవమైన ఉదాహరణగాను (1 కొరింథీ. 12:23–26), సంఘము యొక్క కర్తవ్యపు వర్ణనగాను (1 కొరింథీ. 12:27) ఉపయోగింపబడింది. ఈ పద ప్రయోగం సంఘము యొక్క వర్ణనగా గ్రహింపకున్నట్టయితే, క్రొత్త నిబంధన సంఘ స్వభావాన్ని అర్థం చేసికోలేం.

సంఘం కొరకు క్రొత్త నిబంధన యిచ్చిన ఈ డెసిగ్నేషన్‌కు ప్రత్యేకమైన శ్రద్ధను చూపుదాం. ఈ పద సముదాయం తెలియజేసే సమాచారమేమీ?

## క్రీస్తుతో ఏకీభావం

మొదటిగా, ఈ పద ప్రయోగం క్రీస్తుతో ఏకీభావాన్ని సూచిస్తుంది. "ఒకని నమ్మ కత్వాన్ని క్రీస్తుకు కుదువపెట్టిన" దానికంటెను మార్పు ఎక్కువైనది. ఒకడు క్రీస్తుయొక్క ఆత్మసంబంధమైన శరీరంలో ప్రవేశించినప్పుడు అది క్రీస్తుతో విశేషంగా ఏకమైనట్టౌతుంది.

క్రీస్తులోనికి మార్పుపొందే విధానంలో భాగంగా, క్రీస్తులోనికి బాప్తిస్మంపొందాం. "క్రీస్తుయేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి

బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా?" అని పౌలు అన్నాడు (రోమా 6:3). క్రీస్తుతో ఏకమయ్యే భావన ప్రత్యేకంగా రోమా 6:4లో గుర్తించబడింది: "కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, ఆలాగే, మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మమువలన మరణములో పాలుపొందుటకై **ఆయనతోకూడ** పాతిపెట్టబడితిమి" (ఎంఫసిస్‌నాది), "... మన మందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి" అని పౌలు తెలిపాడు (1 కొరింథీ. 12:13). అప్పుడు, బాప్తిస్మము వద్ద, ఆయన ఆత్మసంబంధమైన శరీరంలోనికి నాటబడినందున, క్రీస్తుతో ఏకత్వంలోనికి మనం తేబడ్డాం.

ఈ ఏకవచనపు, క్రీస్తుతో ఆత్మసంబంధమైన ఏకత్వం వివాహంతో పోల్చబడవచ్చు. ఒక పురుషుడు, ఒక స్త్రీ వివాహ బంధమందు ప్రవేశించినప్పుడు, "ఇద్దరు ప్రజలు ఒకరికొకరు బద్ధులైయుండజేసికొనే" దానికంటె ఎక్కువ అక్కడ జరుగుతుంది. వివాహ మందు ఏకత్వమేర్పడుతుంది – ఈ బంధం ఎంత గాఢమైనదంటే, భార్య భర్తలు "ఏక శరీరమై"యున్నట్టు చెప్పబడ్డారు (ఎఫెసీ. 5:31). "వారు ఒకరికొకరు వాగ్దానాలు చేసికొన్నారు" అని దంపతులనుగూర్చి మనం తరచుగా చెప్తుతూ ఉంటాం. "వారు వివాహబంధమందు ప్రవేశించారు" అని అనడం ఒకవేళ బాగుంటుందేమో. వివాహమనేది కేవలం యిద్దరు కలిసి నడవడానికి, లేక కలిసి ఒకే యింటనుండడానికి, చేయబడింది కాదు; ఇద్దరు కలిసి జీవితమంతా ఒకటైయుండడం, కేవలం జారత్వమో లేక మరణమో తప్ప మరేదియు లయపరచని వివాహ బంధమందు వారు ప్రవేశించారని చెప్పవచ్చు. వారు వివాహంలోనికి ప్రవేశించినప్పుడు వారు తమ సొంత దేహాలమీదనున్న అధికారాన్ని సహితం ఒకరికొకరు లోబరచుకుంటారనేవరకు అది సత్యమైయుంటుంది. పౌలు యిలా అన్నాడు, "భర్తకేగాని భార్యకు తన దేహముపైని అధికారములేదు; ఆలాగున భార్యకేగాని భర్తకు తన దేహముపైని అధికారములేదు" (1 కొరింథీ. 7:4).

అదే విధంగా, మార్పుపొందిన సమయంలో, సంఘము అను ఆత్మసంబంధమైన ఆయన శరీరంతో చేర్చబడినప్పుడు, మనం క్రీస్తుతో ఏకత్వంలో ప్రవేశిస్తాం. మనం క్రీస్తుతో ఏకమైయుంటాం – క్రీస్తు మనవాడు మనము క్రీస్తువారము. మనసొంత జీవితాలమీద మనకు యిక అధికారమేమియు ఉండదు – క్రీస్తుతో మనం ఎడబాయని ఏకత్వంలో ఉంటాం (1 కొరింథీ. 6:16).

## క్రీస్తుద్వారా ఏకత్వం

రెండవది, సంఘము "క్రీస్తు శరీరమను" వర్ణన క్రీస్తు ద్వారా ఏకత్వాన్ని తెలియ జేస్తుంది. అనేక అవయవములు ఒకే శరీరంగా పనిచేసే సజీవమైన సంఘటిత శరీరమై యున్నట్టు అది సంఘాన్ని చిత్రిస్తుంది.

పౌలు యిలా వ్రాశాడు, "ఏలాగు శరీరము ఏకమైయున్నను అనేకమైన అవయవములు కలిగియున్నదో, యేలాగు శరీరముయొక్క అవయవములన్నియు అనేకము లైయున్నను ఒక్క శరీరమైయున్నవో, ఆలాగే క్రీస్తు ఉన్నాడు" (1 కొరింథీ. 12:12).

అనేకమైన వేర్వేరు అవయవములు క్రీస్తు శరీరంగా యిమడ్చబడియున్నాయి. భౌతికమైన దేహాన్ని గూర్చి పౌలు ఏమిచెప్పాడో, సంఘాన్నిగూర్చి కూడా అదే చెప్పవచ్చు: "శరీరమొక్కటే అవయవముగా ఉండక అనేకమైన అవయవములుగా ఉన్నది"; "అవన్నియు ఒక్క అవయవమైతే శరీరమెక్కడ?" ( 1 కొరింథీ. 12:14, 19). ఈ విధంగా, క్రైస్తవులందరు, "క్రీస్తుయొక్క శరీరమైయుండి వేరు వేరుగా అవయవములై యున్నారు" అని మనం తీర్మానింపవలసి యుంటుంది (1 కొరింథీ. 12:27).

---

క్రీస్తుయొక్క శరీరమందలి సభ్యులు అనుభవించే
ఏకత్వము భౌతిక దేహమందలి అవయవములు
అనుభవించు ఏకత్వము వంటిది.

---

"క్రీస్తుయొక్క శరీరము" అనే పద సముదాయము మనము క్రీస్తునకు చెందిన వారమని మాత్రమే గాక, భౌతిక దేహంలోని ప్రతి ఒక్క అవయవము యితర అవయవాలకు చెందినట్టే మనమును ఒకరికొకరం చెందుతామని తెలుపుతోంది. దేహములోని ఒక అవయవము బాధింపబడితే, దానితో తక్కిన అవయవాలు కనికరముతో బాధపడతాయి. "శరీరము" అనే భావననుండి కలిగే విదితమైన తీర్మానం యిది: "అయితే శరీరములో వివాదములేక, అవయవములు ఒకదానినొకటి యేకముగా పరామర్శించు లాగున, దేవుడు తక్కువ దానికే యెక్కువ ఘనత కలుగజేసి, శరీరమును అమర్చియున్నాడు. కాగా ఒక అవయవము శ్రమపడునప్పుడు అవయవములన్నియు దానితో కూడ శ్రమపడును; ఒక అవయవము ఘనత పొందునప్పుడు అవయవము లన్నియు దానితో కూడ సంతోషించును" (1 కొరింథీ. 12:25, 26).

"క్రీస్తు యొక్క శరీరము" అనే పద సముదాయాన్ని అర్థం చేసికొన్నప్పుడు, మతశాఖల విధానంలో ఉన్న వివేకం లయపరచబడుతుంది. మత శాఖల విధానంలో పలు రకములైన శరీరాలున్నాయి, వాటిలో ప్రతిదానికి వ్యత్యాసమైన గుర్తింపు, విశ్వాసం ఉంటుంది. "క్రీస్తు యొక్క శరీరమనే" క్రొత్త నిబంధన భావన, ఒకే శరీరాన్ని, క్రీస్తు శరీరాన్ని ప్రతి క్రైస్తవుడు అందులోని అవయవంగాను, తక్కిన అవయవాలన్నిటిని ప్రేమిస్తూ, ఆ శరీరంలోని యితర ప్రతి అవయవంతోపాటు పాలు కలిగియుంటుంది. క్రొత్త నిబంధన సంఘము క్రీస్తుయొక్క శరీరమైయున్నట్టయితే, "సంఘము" కొరకు మతశాఖల విధానం దేవుని సంకల్పమై యుండదు; మత శాఖల విధానం రైటైనట్టయితే, క్రొత్త నిబంధన సంఘము క్రీస్తు యొక్క శరీరమై ఉండనేరదు.

తరువాత తనయందు విశ్వాసముంచబోయేవారి ఏకత్వంకొరకు తాను అప్పగింపబడి, బంధింపబడక మునుపటి రాత్రి ప్రభువైన యేసు ప్రార్థించాడు (యోహాను 17:21-24). ఆయన మృతులలోనుండి లేపబడిన తరువాత వచ్చిన పెంతెకొస్తు దినాన, భూ సంబంధమైన తన శరీరంగా, ఆయన సంఘాన్ని స్థాపించి, తాను ప్రార్థించిన ఏకత్వాన్ని రూపించి దాన్ని కాపాడనైయున్నాడు. క్రీస్తు యొక్క శరీరంలోనికి మనం ప్రవేశించినప్పుడు,

ఆ శరీరంలోని అవయవములన్నిటితోను ఏకత్వంలో ప్రవేశించినవారమైయుంటాం. వేరు చేసే గోడలన్నీ కూల్చబడ్డాయి: “ఇందులో యూదుడని గ్రీసుదేశస్థుడని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీ అని లేదు; యేసుక్రీస్తునందు మీరందరును ఏకముగా ఉన్నారు” (గలతీ 3:28).

క్రీస్తు యొక్క శరీరంలోని సభ్యులు అనుభవించే ఏకత్వం భౌతికమైన దేహంలోని అవయవాలు అనుభవించే ఏకత్వమువంటిదైయుండాలి – కలిసి పనిచేయడంలో ఏకత్వం, ఒకరినొకరు ప్రేమించుకొనడం, ఒకరియెడల ఒకరు కనికరం కలిగియుండడం (అవసరం). భౌతిక దేహంలోని ఏ ఒక్క అవయవం కూడా తక్కిన అవయవాలతో పోటీ పడియుండదు, ఒక అవయవం తక్కిన అవయవములన్నిటితో కలిసి పని చేస్తుంది మరియు సమైక్యతతో కూడినదై ఏక శరీరంగా ఫలిస్తుంది.

తన ప్రజలకు ప్రభువైన యేసు చేసిన విన్నపం ఏదైనా ఉంటే, భూమిమీద వారు తన ఆత్మసంబంధమైన శరీరంగా ఉండాలనేదే. అన్ని రకాలైన మత శాఖలుగా ఉండాలని ఆయన వారిని కోరలేదు. ఆత్మసంబంధమైన ఆయన శరీరంగా ఉంటూ, ఆయన కోర్కెను నెరవేర్చడంవలన ఆయనను ఘనపరచవలసిందిగా దైవభక్తి ఆదేశిస్తుంది.

## క్రీస్తుకొరకు ఉపయోగం

మూడవది, సంఘముయొక్క “శరీరమనే” వర్ణన, క్రీస్తుకొరకు ఉపయోగం లేక ప్రయోజనమనే అంతరార్థాన్ని స్ఫురింపజేస్తుంది. లోకంలో క్రీస్తుయొక్క పని జరిగింప బడవలసిన విధానాన్ని అది గుప్తం చేస్తుంది.

తన జీవితము, పరిచర్య అనేవాటిని గూర్చి పౌలు యిలా అన్నాడు, “నా మట్టుకైతే బ్రదుకుట క్రీస్తే ...” (ఫిలిప్పీ. 1:21). అతడు ఏ మత శాఖకో, లేక మానవ కల్పితమగు ఏ గుంపుకో ప్రాతినిధ్య మియ్యలేదు. మనుష్యుల మధ్య సమధానపరచు దేవుని సాధనంగా అతడు తన్ను తాను చూచుకున్నాడు: “కావున దేవుడు మా ద్వారా వేడుకొనినట్టు మేము క్రీస్తుకు రాయబారులమై దేవునితో సమధానపడుడని క్రీస్తు పక్షముగా మిమ్మును బతిమాలుకొనుచున్నాము” (2 కొరింథీ. 5:20). తన శ్రమలు క్రీస్తు శరీరము కొరకైయున్నట్టు పౌలు చూచాడు: “ఇప్పుడు మీకొరకు నేను అనుభవించుచున్న శ్రమలయందు సంతోషించుచు, సంఘము అను ఆయన శరీరము కొరకు క్రీస్తు పడిన పాట్లలో కొదువైన వాటియందు నా వంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను” (కొలస్సీ. 1:24).

భూమిమీద క్రీస్తుయొక్క పని ఏ విధంగా సాగించబడాలి? క్రీస్తు ప్రభువు పరలోకమందు తండ్రి కుడిపార్శ్వమున ఆసీనుడైయుండగా భూసంబంధమైన పరిచర్య ఎలా కొనసాగింపబడాలి? ఈ ప్రశ్నలకు జవాబు స్పష్టంగా, “ఆయన శరీరము ద్వారానే” అని చెప్పవచ్చు. సంఘముయొక్క స్థాపనతో, లోకాన్ని ప్రేమించి సేవించే సాధనంగా క్రీస్తు ప్రభువు ఆత్మ సంబంధమైన తన శరీరాన్ని లోకంలోనికి పంపాడు.

శిరస్సు లేని శరీరాన్ని గూర్చిగాని, లేక శరీరం లేని శిరస్సును గూర్చిగాని క్రొత్త

నిబంధన మాట్లాడలేదు. క్రైస్తవులెవ్వరూ లోకంలో లేకున్నట్టయితే, నడిపించడానికో, మార్గం చూపడానికో లేక తన పనిచేయడానికో క్రీస్తుకు శరీరముండేది కాదు. క్రైస్తవులు క్రీస్తు ప్రభువును వారి ఏకైక అధికారిగా, మార్గదర్శిగా చూడకుండినట్టయితే, సంఘము శిరస్సులేని శరీరమైయుండేదే. క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నాడు, భూమిమీదనున్న జనులతో ఆ సంఘం రూపింపబడినదై, తమ్మును తాము అప్పగించుకొని ఆయన పని జరిగించే వర్క్ ఫోర్స్‌గా యిక్కడున్నారు.

తన పని జరిగించడానికి క్రైస్తవులు క్రీస్తు ప్రభువు యొక్క ఆత్మసంబంధమైన శరీరమై యున్నారు. లోకంయొక్క అవసరతలను చూడడానికి మనం ఆయన కన్నులైయున్నాం. మనం మానవ అవసరతను చూచి దానికి పరిచర్య చేయకుంటే, ఆత్మ సంబంధమైన ఆయన శరీరము యొక్క కన్నులు దృష్టిలేనివై ఉంటాయి. మనము ఆయన వాక్యమును విని ఆయన నడిపింపును లక్ష్యపెట్టవలసిన ఆయన చెవులైయున్నాం. క్రీస్తు యొక్క ఆత్మసంబంధమైన శరీరం తన చిత్తముపట్ల చెవిటిదైయుండడం ఎంతటి విషాదకరం! ఆయన వాక్యాన్ని ప్రకటించడానికి, ఈ లోకంలో ఆయన కీర్తిని గానం చేయడానికి మనం ఆయన నాలుకయైయున్నాం. ఈలాటి సమయంలో ఆయన శరీరం నోరు మూసికొనియుంటే అది ఆయన హృదయాన్ని బద్దలు చేస్తుంది. భారములను బాధ్యతలను మోయడానికి మనం ఆయన భుజములపై యున్నాం. ఆయన మనకు అప్పగించే ఏ పనులనైనా చేయడానికిగాను తన సంఘం ఆరోగ్యంగాను బలంగాను ఉండాలని క్రీస్తు ప్రభువు కోరుతున్నాడు. లోకంలో ఆయన పనులకొరకు పరుగెత్తడానికి మనం ఆయన కాళ్లైయున్నాం. ఆయన కాళ్లను బలంగా నిలిపి త్వరగా పరుగెత్త సిద్ధంగా ఉంచాలి. మనం సేవచేసే ఆయన దయగల చేతులైయుండాలి. పరిచర్యకొరకు ఆయన చేతులు సంపూర్ణమైనవిగాను, అర్హతగలవిగాను, సమర్పణతోకూడినవిగాను ఉండేలా చూద్దాం.

ఆత్మసంబంధమైన క్రీస్తు శరీరంయొక్క ఉపయోగం, మేథావిత, వాస్తవికతలను గూర్చి ఆలోచించు. ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవడైనా క్రైస్తవుడైతే, క్రీస్తు శరీరముయొక్క పనిచేయు సభ్యుడైయుండి ఆయన ప్రేమను కనుపరచువాడై ఉండాలి. ఈ రూపంలో అతడు, క్రీస్తు ప్రభువుయొక్క పరిచర్యను కొనసాగించువాడై ఉంటాడు. అతడు క్రీస్తుతోను, ఆయన శరీరంలో తక్కిన సభ్యులతోను అతడు ఒకడైయుంటాడు. ఈ విధంగా క్రీస్తు సంఘం యొక్క ఏకత్వము లోకమందు విదితమై ఉంటుంది. "క్రీస్తుయొక్క శరీరం" ఎంత సాధారణంగాను, అదే సమయంలో ఎంత అమోఘమైయుంటుందో!

పరిమితమైన మన మానవ జ్ఞానంలో సయితం "క్రీస్తుయొక్క శరీరమను" భావన అర్థసహితమైయుంటుంది. అది సమర్థత కలది, పనిచేయ వీలుపడునది, ఆచరణకు తగినదైయుంది. అది దేవుని జ్ఞానాన్ని ఆయన మహిమను ప్రతిఫలింపజేస్తుంది.

క్రీస్తు యొక్క శరీరంగా, క్రీస్తు మహిమ కొరకు క్రీస్తు ప్రభువు యొక్క పనిని జరిగించుదాం.

## ముగింపు

భూలోకమందు సంఘము క్రీస్తు ప్రభువుయొక్క శరీరమైయుంది. ఈ సత్యాన్ని బట్టి, రోమాలోని క్రైస్తవులను గూర్చి పౌలు ఈ విధంగా తెలియజేసాడు: "ఒక్క శరీరములో మనకు అనేక అవయవములుండినను, ఈ అవయవము లన్నిటికిని ఒక్కటే పని యేలాగు ఉండదో, ఆలాగే అనేకులమైన మనము క్రీస్తులో ఒక్క శరీరముగా ఉండి, ఒకనికొకరము ప్రత్యేకముగా అవయవములమై యున్నాము" (రోమా 12:4, 5). క్రైస్తవులుగా మారడంలో, క్రీస్తుతో ఏకత్వంలో మనం ప్రవేశిస్తాం, క్రీస్తుద్వారా ఒకరితో ఒకరం ఏకమైయుండి, క్రీస్తు కొరకు ప్రయోజనకరంగాను, పనిచేయువారంగాను ఉంటాం.

వస్త్రాలయపు షోరూమ్స్‌లో ఉండే మానవ బొమ్మకును మానవ జీవికి ఎంత వ్యత్యాసముంటుంది! మానవ బొమ్మకు రూపముంది, ప్రాణం లేదు. దానికి వెలుపటిది దేహరూపం ఉంది, కాని లోపల ఆత్మ శూన్యం. అది కేవలం బొమ్మ మాత్రమే, కృత్రిమమైన ప్రాతినిధ్యమేగాని నిజమయ్యింది కాదు. మానవ జీవికి రూపము, ఆత్మ, ప్రాణము ఉన్నాయి; దేహంలోను ఆత్మలోను నిజరూపమే, అతనికి దేహము, ఆత్మ మనస్సులనేవి ఉన్నాయి. అతడు ఆలోచింపగలడు, ప్రేమింపగలడు, లోబడగలడు ఫీల్‌కాగలడు.

మానవ (కొట్లలో) బొమ్మకును – మానవ జీవికిని ఎంత వ్యత్యాసముందో మానవ కల్పిత సంస్థలకును క్రీస్తు యొక్క శరీరానికిని అంత వ్యత్యాసముంది. మానవ సంస్థలకు ఆకారముంది, కాని దేవుడు వాటియందు వసించడు; కేవలం మానవుడే అందులో నివసిస్తాడు. మానవ సంస్థ సాధింపదలచుకున్నదేదైనా, కేవలం మానవ బలము జ్ఞానముల ద్వారా చేయబడుతోంది. క్రీస్తు యొక్క శరీరమందు ఆత్మ నివసిస్తాడు, దేవుని జీవముచేత సజీవం చేయబడుతుంది, క్రీస్తుచేతనే స్వయంగా నడిపింపబడుతోంది.

క్రొత్త నిబంధన సంఘము క్రీస్తు యొక్క శరీరమైయుంది. అధికారపూర్వకమైన ప్రతి క్రైస్తవుడు అందులో సభ్యుడైయుంటాడు. అది మానవ సంస్థ కాదు, క్రీస్తు యొక్క ఆత్మచేత అది సజీవమైన సంఘటిత శరీరం (living organism). దానికి శిరస్సైయున్న క్రీస్తుచే అది నడిపింపబడుతుంది. భూమిమీద దాని ఉద్దేశం క్రీస్తుప్రభువు యొక్క మహిమకొరకు జీవించుతూ సేవించడమే.

నీవు క్రీస్తు శరీరములోని అవయవమైయున్నావా?

## స్టడీ మరియు చర్చకొరకైన ప్రశ్నలు

1. సంఘానికి సంబంధించి "క్రీస్తు యొక్క శరీరము" అనే పద ప్రయోగం ఉపయోగింపబడిన రెండు మార్గాలను చర్చించుము.
2. క్రీస్తులోనికి మన బాప్తిస్మము క్రీస్తుతో ఐక్యమయ్యే పదాలను వర్ణించుము.
3. క్రీస్తులోనికి ప్రవేశించడాన్ని గూర్చి రోమా 6:3 ఏమి చెప్పుతోంది?
4. వివాహంలోని ఏకత్వంతో క్రీస్తునందలి మన ఏకత్వాన్ని పోల్చి చూడు.
5. క్రీస్తుతో ఐక్యముగలవారమయ్యే విషయంలో రోమా 6:4 ఏమంటుంది?
6. క్రీస్తులోనికి మనం ప్రవేశించేదాన్ని గూర్చి 1 కొరింథీ. 12:13 ఎలా

చెప్పుతుంది?

7. క్రీస్తు శరీరంలోని అవయవములు ఎవరు? సంఘములా లేక క్రైస్తవులా?
8. మనలో ఒకరితో నొకరికి ఉండవలసిన సంబంధాన్ని గూర్చి "క్రీస్తు యొక్క శరీరము" అనే ప్రయోగం ఏమి తెలుపుతుంది?
9. క్రీస్తు శరీరము యొక్క ఏకత్వము అనే భావనకు సంబంధించి మత శాఖల విధానాన్ని చర్చించుము.
10. క్రీస్తులోని మన ఐక్యతనుగూర్చి గలతీ. 3:28 ఏమంటుంది?
11. లోకంలో క్రీస్తు ప్రభువు యొక్క పనిని ఏ విధంగా జరిగించాలి?
12. సంఘము శిరస్సులేని శరీరమా లేక శరీరంలేని శిరస్సా?
13. లోకంలో క్రీస్తు శరీరంగా మనం ఎలా పనిచేస్తాం?
14. సంఘము మరియు "క్రీస్తు యొక్క శరీరము" ఒక్కటేనా?
15. సంస్థ, సజీవ శరీరం అనేవాటి పోలికలను తారతమ్యాలను తెలుపుము.

---

సూచనలు

[1]అనుబంధం – 3లో క్రొత్త నిబంధనలోని "క్రీస్తు శరీరం" అనే పద ప్రయోగాలను చేర్చడం జరిగింది. సంఘం యొక్క స్వభావాన్ని చూడడానికి ఈ పఠనంలో అవి సహకరిస్తాయి.